క్లుప్తంగా

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: భగవాన్ శ్రీసత్యసాయి శత జయంతి మహోత్సవంలో భాగంగా మొగలికుదురులోని జగ్గన్నపేట సాయిప్రభ మందిర్‌లో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. పలువురు భక్త దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. 99 సంకీర్తనలతో భజన కార్యక్రమం నిర్వహించారు. ఉచిత మల్టీ స్పెషాలిటీ మెగా ఉచిత వైద్య శిబిరంలో పలు విభాగాలకు చెందిన డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలందించారు. శ్రీసాయిరామ్ కోటి లిఖిత నామజపం సర్వమత ధర్మ స్తూపం ఆవిష్కరణ ఘనంగా జరిగింది. దీంతో పాటు విద్యార్థులకు పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కోనసీమ జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థలు అధ్యక్షుడు అడబాల కొండబాబు పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్రహారతి, కుంభహారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామి పటిక బెల్లం తులాభారంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ–ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.88,760, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.23,376తో మొత్తం రూ.1,12,136 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు.

ప్యాక్ హౌస్‌ను పరిశీలించిన కలెక్టర్



ప్యాక్‌హౌస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అంబాజీపేట: స్థానిక సర్పంచ్, కొబ్బరి రైతు దొంగ నాగేశ్వరరావు ప్యాక్ హౌస్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. కురిడీ కొబ్బరి తయారీ, కొబ్బరి ఎగుమతులు వాటి వల్ల లాభాలు, కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారీ అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, మాజీ సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎంపీడీవో జీవీ సరోవర్, ఎంఈఓలు కె.వెంకటేశ్వ రరావు, మోకా ప్రకాష్, విద్యా కమిటీ చైర్మన్ ఎం.లోకేష్, ప్రధానోపాధ్యాయులు కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి

కొత్తపేట: కోర్టులో పేరుకుపోయిన పెండింగ్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారానికి కృషి చేయాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.రమణారెడ్డి న్యాయవాదులకు సూచించారు. శనివారం స్థానిక కోర్టు హాలులో మీడియేషన్, ఆ ప్రక్రియ ఫలితాల గురించి సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి న్యాయవాదులతో సమీక్షించారు. కోర్టుకు వచ్చిన రెండు పార్టీల మధ్య సమన్వయం కుదిర్చి రాజీ చేయడం ద్వారా కేసులు సత్వర పరిష్కారం చేయవచ్చన్నారు. తద్వారా పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు.

షణ్ముఖనాథ.. సుబ్రహ్మణ్యం

- భక్తిశ్రద్ధలతో షష్ఠి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- నాగేంద్రునికి పూలు, పడగల సమర్పణ



కడలిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం



అప్పనపల్లిలో స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కొత్తపేట: సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. గ్రామగ్రామాన వేంచేసిన సుబ్రహ్మణ్యస్వామిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తికేయా శరణు.. శరణు అంటూ స్వామిని పూజించారు. ప్రధానంగా మండలంలోని వాడపాలెం స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రంలో షష్ఠి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితర ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. కొత్తపేట హరిహర దేవాలయ ప్రాంగణంలో స్వయంభూ సుబ్రహణ్యేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు.

రాజోలు: కడలి కపోతేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కాకాని వెంకట సత్య కృష్ణకుమార్, రుద్రపాక కల్యాణశర్మల ఆధ్వర్యంలో శైవాగమోర్త ప్రకారం స్వామి వారి కల్యాణం తంతు నిర్వహించారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ స్వామి వారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

మామిడికుదురు: సుబ్రహ్మణ్య షష్ఠి తీర్థం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. బి.దొడ్డవరం బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి పాల కావిళ్ల సంబరం నిర్వహించారు. శిరస్సున బిందెలతో పాలు పెట్టుకుని మహిళలు ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగిస్తూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. పలువురు భక్తులు ఒక రోజు సుబ్రహ్మణ్య దీక్ష చేపట్టారు. పలు గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల వద్ద షష్ఠి వైభవంగా జరిగింది.

సర్వశక్తి స్వరూపుడు కార్తికేయుడు

సఖినేటిపల్లి: మోరిపోడు, టేకిశెట్టిపాలెం, అంతర్వేది సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయాల్లోను, మోరి, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి, సఖినేలిపల్లిలంక, అంతర్వేదిపాలెం, అంతర్వేది దేవస్థానం, గుడిమూల గ్రామాల్లో శివాలయాల్లోను, మోరి వీరభద్రస్వామి, వీవీ మెరక, కేశవదాసుపాలెం వినాయకస్వామి ఆలయాల్లోను, అంతర్వేదికర దేవతామూర్తుల ఆలయాలలోను షష్ఠి వేడుకలు నిర్వహించారు. పురాతన మోరిపోడులోని స్వామి ఆలయం వద్ద పండగ వాతావరణం నెలకొంది. వేకువజాము నుంచి స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. అలాగే నందీశ్వరుని వద్ద మహిళలు దీపారాధనలు చేసి పూజలు నిర్వహించారు. కేశవదాసుపాలెంలో షష్ఠి మహోత్సవాల్లో భక్తులు కోలాట భజన చేశారు.

అంబాజీపేట: మాచవరం, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, వాకలగరువు, కోశివారి అగ్రహారం గ్రామాల్లో వేంచేసిన శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి శనివారం ఎంతో ఉత్సాహంగా జరిగింది. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తమ ముడుపులు, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త గోకవరపు సత్యనారాయణ మూర్తి, వారి కుమారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను సత్యసాయి సేవా సమితి సభ్యులు అందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంబాజీపేట ఎస్సై కె.చిరంజీవి పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం, అయినవిల్లి, శానపల్లిలంక, వెలువలపల్లి గ్రామాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముక్తేశ్వరంలో శ్రీకంఠం చక్రవర్తి, వెలువలపల్లి శంభోశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సుబ్రహ్మణ్య స్వామికి కల్యాణం జరిపారు. శనివారం తెల్లవారుజామున సుబ్రహ్మణ్య స్వామికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూలు, పడగలు, ప్రసాదాలు సమర్పించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలమూరు వల్లీ, దేవసేన సమేత సూర్య గోపాల సుబ్రహ్మణ్యస్వామి, చింతలూరు, పెదపళ్ళ, జొన్నాడ, మూలస్థానం తదితర గ్రామాల్లోని వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి ఆలయాల్లో స్వామికి ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పెదపళ్ళలో శుక్రవారం రాత్రి మరిడి మురళీకృష్ణ పావని దంపతుల చేతుల మీదుగా వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు.



వాడపాలెంలో సుబ్రహ్మణ్యస్వామిని అభిషేకిస్తున్న అర్చకుడు శ్రీనివాస్



ఆలమూరులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



మోరిపోడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద క్యూలో భక్తులు

పిల్లలపై పర్యవేక్షణ ఉండాలి

కొత్తపేట: ప్రతిరోజూ తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసంపై పర్యవేక్షణ ఉండాలని ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి పర్యవేక్షణలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. దానిలో భాగంగా స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం నేలపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యా కమిటీ చైర్మన్ కుడుపూడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీఓ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పిల్లలను ప్రతీరోజూ పాఠశాలకు పంపించడంతో పాటు వారు చదువులో ఎంతవరకూ రాణిస్తున్నారు? ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారా? లేదా మొక్కుబడిగా వెళ్లి వస్తున్నారా? వంటి విషయాలను గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.హరిప్రసాద్, వైస్ చైర్మన్ బండారు భాను, పంచాయతీ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, విద్యా కమిటీ సభ్యులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలికిపురం: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా విధానంలో సమూల మార్పులు అవసరమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కేశనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లోఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు విద్యార్థుల నడవడిక ఎలా ఉండాలి అనే అంశంపై అనేక సూచనలు చేశారు. సర్పంచ్ యెనుముల నాగు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేశనపల్లి పాఠశాల పేరెంట్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మామిడికుదురు: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు శనివారం ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. దీనిలో భాగంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పేరెంట్స్ క్రీడల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓలు, ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబాజీపేట: పాఠశాలకు, కళాశాలలకు వెళుతున్న తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిఘా ఉంచి ఎప్పటికప్పుడు వారి నడవడికలు గమనిస్తూ ఉండాలని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన మెగా పేరెంట్స్ టీచర్స్ విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సీఐ భీమరాజు సోషల్ మీడియా, సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్, మాదక ద్రవ్యాలు వలన కలిగే నష్టాలు, మహిళా భద్రత, రోడ్డు భద్రత, ఇంటి భద్రతపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అలాగే మండలంలోని అన్ని పాఠశాలల్లోను ఆత్మీయ సమావేశాలు జరిగాయి, కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పీఎంసీ చైర్మన్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొత్తపేట జెడ్పీజీహెచ్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో శ్రీకర్

పి.గన్నవరం: పిల్లల నడవడికను, ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ అన్నారు. మండలంలోని పలు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శనివారం జరిగిన మెగా పేరెంట్స్, మీట్ టీచర్స్ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.



పి.గన్నవరంలో ఉన్నత పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివకృష్ణ

కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మెగా పేరెంట్స్, మీట్ టీచర్స్ కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

అయినవిల్లి: మండలంలోని మాగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల తల్లులకు పాఠశాల ఆవరణలో రంగవల్లుల పోటీలు, విద్యార్థుల తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. సర్పంచ్ కాశి వీవీ సత్యనారాయణ, గ్రామ పెద్దల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలోనూ మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు.

సఖినేటిపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిలోను తల్లి తండ్రులు, ఉపాధ్యాయులతో మెగా సమావేశాలు నిర్వహించినట్టు ఎంఈవో–1, 2 డి.కిషోర్ కుమార్, ఎం.వెంకటేశ్వరరావులు శనివారం తెలిపారు. ఈ మెగా సమావేశాలలో విద్యాపరమైన అంశాలు చర్చించడంతో పాటు, సమగ్ర ప్రగతి పత్రం నివేదికలు ఉపాధ్యాయుల ద్వారా తల్లిదండ్రులకు వివరించినట్టు వారు అన్నారు.

టీబీని అంతం చేయాలి



కె.జగన్నాథపురంలో రోగులకు కళ్లె పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అయినవిల్లి: టీబీ వ్యాధిని అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వీరవల్లిపాలెం వైద్యాధికారి పి.విజయ్ అన్నారు. శనివారం మండలంలోని కె.జగన్నాథపురం సచివాలయం వద్ద కళ్లె నమూనా సేకరణ క్యాంపును సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంగుమళ్ళ కాశీఅన్నపూర్ణ ప్రారంభించారు. వైద్యులు విజయ్ మాట్లాడుతూ రెండు వారాల పైబడి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం , కళ్లెలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా కళ్లె పరీక్ష చేయించుకోవాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శీతాకాలంలో ఎడతెరిపి లేని దగ్గుతో జ్వరాలతో ప్రజలకు అస్వస్థతకు గురవుతున్నారని తద్వారా ఇటువంటి వ్యాధులు ఒకరి నుంచి ఒకరికి సోకుతున్నాయన్నారు. హెల్త్ సూపర్ వైజర్ రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్, హెల్త్ అసిస్టెంట్ ముద్రగెడ నరసింహారావు, ఎంఎల్‌హెచ్‌పీ షారోన్, ఏఎన్‌ఎం గంగాభవాని, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సహదేవ్‌కు జాతీయ సేవారత్న అవార్డు



విజయవాడలో ప్రముఖుల చేతులు మీదుగా సేవారత్న అవార్డు అందుకుంటున్న సహదేవ్

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెంకు చెందిన హ్యూమానిటీ హార్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తాడి సహదేవ్‌కు శనివారం జాతీయ స్థాయి సేవారత్న అవార్డు దక్కింది. ఈ మేరకు విజయవాడలో నిర్వహించిన పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ సదస్సులో ప్రముఖుల చేతుల మీదుగా పై అవార్డు సహదేవ్ తీసుకున్నారు. కాగా తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ సదరు అసోసియేషన్ సేవారత్న అవార్డుతో సత్కరించినట్టు సహదేవ్ మీడియాకు తెలిపారు.

క్రీస్తు కృపతో జనులు సంతోషంగా ఉండాలి



ఐక్యక్రిస్మస్ వేడుకలో మాట్లాడుతున్న అధ్యక్షుడు స్టీవెన్

మామిడికుదురు: ఏసుక్రీస్తు కృపతో సర్వజనులు సంతోషంగా ఉండాలని యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు సీహెచ్ స్టీవెన్ సూచించారు. మామిడికుదురు హైస్కూల్ రోడ్డులోని రెవరెండ్ పి.ప్రభుదాసు మందిరం వద్ద శనివారం ఐక్యక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్టీవెన్ మాట్లాడుతూ విశ్వ మానవాళి ఆయురారోగ్యాలతో ఉండాలని, శాంతి భద్రతలతో ప్రజలంతా ఆనందంగా గడపాలని అభిలాషించారు. కార్యదర్శి ప్రకాష్, ట్రెజరర్ నాని, పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన క్రైస్తవులు ఐక్యక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.

'సలాది'కి ఉత్తమ జాతీయ పురస్కారం

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారం గ్రామానికి చెందిన సలాది జయప్రకాష్ నారాయణకి ఉత్తమ జాతీయ సేవా పురస్కారం స్వీకరించారు. అంతర్జాతీయ సామాజికవేత్తల దినోత్సవం సందర్భంగా పాన్ ఇండియా సోషల్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ హోటల్ ఐలాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో సలాది జయప్రకాష్ నారాయణకు ఉత్తమ జాతీయ సేవారత్న పురస్కారాన్ని అందించారు. మూలస్థానంలో సలాది జయప్రకాశ్ నారాయణ తన తండ్రి సలాది వెంకట్రావు అడుగుజాడల్లో నడుస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన సేవలను గుర్తించి పాన్ ఇండియా సోషల్ కల్చర్ అసోసియేషన్ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఉత్తమ జాతీయ సేవా పురస్కారాన్ని సలాది జయప్రకాష్ నారాయణకు ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ మాజీ కార్యదర్శి ఎం.బాలగంగాధర్ తిలక్, శ్రావణిస్ మీడియా ఎండీ వెన్నం శ్రావణి, టీడీపీ ఎన్నారై కోఆర్డినేటర్ చప్పిడి రాజశేఖర్, బీఆర్ సునీల్ కుమార్, పాన్ ఇండియా కల్చరల్ అసోసియేషన్ అధినేత అద్దంకి రాజా చేతుల మీదుగా అందజేశారు. ఉత్తమ జాతీయ సేవారత్న అవార్డు స్వీకరించిన సలాది జయప్రకాష్ నారాయణను పలువురు నాయకులు, గ్రామస్తులు అభినందించారు.



సేవారత్న అవార్డు స్వీకరిస్తున్న జయప్రకాష్ నారాయణ

జెడ్పీటీసీ సేవలు అభినందనీయం

సఖినేటిపల్లి: రామేశ్వరం కేంద్రంగా పేదలను ఆదుకోవడంలో మండల జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ చూపుతున్న చొరవ అభినందనీయని ఖతార్ తెలుగు క్రైస్తవ సహవాసం(టీసీఎఫ్) చర్చి పాస్టర్ రెవ.బిషప్ బుల్లబ్బాయి అన్నారు. శనివారం వివరాలు ఈ మెయిల్ ద్వారా చర్చి నిర్వాహకులు మీడియాకు తెలిపారు. శుక్రవారం రాత్రి ఖతార్‌లోని దోహాలో యాభై ఏళ్ల చరిత్ర ఉన్న టీసీఎఫ్ చర్చిలో ఆదేశం వైఎస్సార్ సీపీ కన్వీనర్, రామేశ్వరం ఎన్నారై దొండపాటి శశికిరణ్ తల్లి, జెడ్పీటీసీ అన్నపూర్ణను రెవ.బుల్లబ్బాయి తదితరులు ఘనంగా సత్కరించారు. శశికిరణ్ ప్రోత్సాహంతో అన్నపూర్ణ చేస్తున్న సమాజ సేవను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సంఘస్తులను కోరారు. పెద్దలు వర్జిల్‌బాబు, వర్దనపు ప్రకాష్, నల్లి ప్రసాద్, బందెల విల్సన్‌బాబు, నల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఖతార్‌లో జెడ్పీటీసీ అన్నపూర్ణను సత్కరిస్తున్న బుల్లబ్బాయి

వేధిస్తున్న ఎండుగడ్డి కొరత

- ట్రాక్టర్ గడ్డి రూ.12 వేల పైమాటే
- రూ.35 పలుకుతున్న మోపు గడ్డి
- పాడి రైతులకు భారం

ఆలమూరు: ఖరీఫ్ సీజన్‌లో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలు.. ఆధునిక యాంత్రీకరణ.. మూగజీవాల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పాడి పశువుల పోషణకు, అధిక పాల దిగుబడికి మేలైన, మెరుగైన దాణాగా ప్రసిద్ధి గాంచిన ఎండుగడ్డి సామాన్య పాడి రైతులకు అందని ద్రాక్షగా మారింది. వ్యవసాయ విధానం ఆధునీకరణ దిశగా పయనించడంతో పాటు రైతులు తమకు కూలీ ఖర్చులు ఆదా అవుతున్నాయంటూ వరికోత యంత్రాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఎండుగడ్డి కొరత సమస్య ఏటా మరింత జటిలంగా మారుతుంది. వరి కోత యంత్రాలను వినియోగించి కోతలు కోయడం వల్ల ఆ గడ్డి నిరుపయోగంగా మారుతుంది. అధిక సంఖ్యలో రైతులు వరి కోత యంత్రాలను ఆశ్రయించడం వల్ల ప్రతి సీజన్‌లో ఎండుగడ్డి కొరత తీవ్రత నానాటికి అధికమవుతోంది. దీంతో స్థానిక పాడి రైతులు సమీపాన చాగల్నాడు, మెట్ట ప్రాంతాల నుంచి ఎకరం గడ్డిని అధిక ధరకు కొనుగోలు చేసి తీసుకు వస్తున్నారు. దీనికి మళ్లీ రవాణా, ఎగుమతి, దిగుమతులు, కూలీల ఖర్చుతో కలిపి రూ.ఐదు వేలు ట్రాక్టర్ గడ్డి ఇంటికి తీసుకువచ్చేసరికి రూ.12 వేల వరకూ అవుతుంది.

ఎండు గడ్డికి భలే డిమాండ్

గతంలో ఖరీఫ్‌లో లభించే ఎండుగడ్డిని పాడి రైతులు పశుగ్రాసంగా ఏడాది పొడవునా వినియోగించడం పరిపాటిగా మారింది. దీంతో ఖరీఫ్ సీజన్‌కు లభించే ఎండుగడ్డికి ఎనలేని ప్రాధాన్యం ఉంటుంది. ఇటీవల రబీ సీజన్‌లో కూడా ఎండుగడ్డిని సేకరించి పశువులకు దాణాగా సేకరిస్తున్నారు. కూలీలతో కోత కోసేందుకు అవకాశం లేకపోవడంతో యంత్రాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి.



గుమ్మిలేరులో ట్రాక్టర్‌పై తరలిస్తున్న ఎండుగడ్డి



నవాబుపేటలో వరికోత యంత్రాలతో కోసిన గడ్డిని సేకరిస్తున్న మహిళ కూలీ

కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గంలోని 11 మండలాల్లో సుమారు 28 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టగా దాదాపు 25 వేల ఎకరాల్లోని పంటను యంత్రాలతోనే కోశారు.

గడ్డి సేకరణ యంత్రాలతో మేలు

ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన గడ్డి కోత యంత్రం (స్ట్రాబేలర్)తో కొంత మంది రైతులు గడ్డిని సేకరిస్తున్నారు. ఈ విధంగా సేకరించి గడ్డి మోపు ధర రూ.35 వరకూ పలుకుతుంది. అంత ధర వెచ్చించి ఎండుగడ్డి కొనుగోలు చేసే స్తోమత లేని పేద పాడి రైతులు వరికోత యంత్రాలతో కోసిన పొలాలకు వెళ్లి ఎండుగడ్డిని సేకరిస్తున్నారు. ఆ గడ్డిని పదిలంగా చేసుకుని పశువులకు పెడుతున్నారు. గతంలో అయితే పట్టించుకోని ఆ గడ్డిపరకను నేడు బంగారంలా చూస్తున్నారు.